# ఎదగని మనుషులు

రంధి సోమరాజు

పాపం, రిక్షా సూరన్న అకస్మాత్తుగా చచ్చిపోయాడు. చచ్చిపోయిన నాటికి అతనికి భార్య వుంది. పేరు గైరమ్మ. ఇద్దరు పిల్లలున్నారు. ఒకడు అయిదేండ్లవాడు. మరొకడు ఆరేండ్లవాడు. గైరమ్మ పిల్లలను దగ్గరకు తీసుకొని ఏడ్చింది. ఊరికీ, రిక్షావాడకూ దూరంగా ఓ మెట్టమీద మకాం పెట్టడంవల్ల ఆమెను ఎవరూ ఓదార్చడానికి రాలేదు. ఆమె చెంపల మీద కన్నీళ్లను ఎండబెట్టి పాపం, గాలి చల్లగా ఓదార్చింది. గైరమ్మ గుండెను గట్టిపరచుకుంది. పొంగిపొంగి వచ్చే దుఃఖాన్ని చెంగుతో తుడిచివేసింది. ఏమి చెయ్యాలో దిక్కులు తోచని పరిస్థితులను ఆలోచనల గుడ్డలో పోసి వడకట్టింది. ఒకసారి మూటలు మోయాలనుకుంది. కుర్రవాళ్లను వాళ్లింటి దగ్గరా, వీళ్లింటి దగ్గరా పిల్లలనెత్తుకునే పనికి పెట్టాలని అనుకుంది. మరొకసారి అంట్లు తోమాలనుకుంది.

ఎందుకనో ఛీఛీ అనుకుంది. అల్యూమినియం కంపెనీలో చక్రం తిప్పితేనో... తాపీమేస్త్రికి ఇటుకలందిస్తేనో, అనుకుంది. అప్పుడే ఆమె మనసులో గారవల్ల తాపీమేస్త్రీ అవతరించాడు. పచ్చిబూతులతోనే బతికే ఆ మేస్త్రీ నోటికొచ్చినట్లు యిచ్చకాలాడి, మంచినీళ్లు తెమ్మని, చేయి పట్టుకున్నట్లు ఆమె గుండె గిలగిలలాడింది. 'సూరన్న బావకు నాను సస్తే అపచారం చెయ్యను. నా దేవుడు నా సూరన్న బావ' అని కళ్లంట నీళ్లు పెట్టుకుంది. ఒకసారి సూరన్న బావ కళ్లముందు తిరిగాడు. ఖాళీగా వున్న ఆ రిక్షా సీటుమీదనే కూర్చున్నట్లు మెదిలాడు... నీళ్లబిందెలో తలవూపాడు. పిల్లల కళ్లలో తళతళలాడాడు. గైరమ్మ పిల్లల్ని గట్టిగా కౌగలించుకుని, ఏడ్వబోయింది. అప్పుడే... ఆమె వీపుమీద-సూరన్నబావ నీకేమీ భయంలేదని తట్టినట్లయింది. వెనక్కు తిరిగిచూసింది. వెనుక చెట్లు నిలిచివున్నాయి. ఆ చెట్లమీద కిరణాలు చిత్రంగా మెరుస్తున్నాయి. గైరమ్మ దేవుడికి దండం పెట్టింది. పిల్లలను గుండెలకు చేర్చుకుంది, పొంగి వస్తూన్న దుఃఖాన్ని హాలాహలంలా మింగింది.

గైరమ్మకు గతం గుర్తుకొచ్చింది. గతంలోని వెన్నెల ఆమె ముందు పరుచుకుంది. ఆ దిబ్బమీద వెన్నెల పకపకా నవ్వింది. సూరన్న చేతిలో గైరమ్మ పైటచెంగు మిగిలిపోయింది.

"ఈ రిక్షామీద, కూర్చోవే... ఈ దిబ్బ సుట్టూ తిప్పుతాను" అనేవాడు.

"కూసుంటాను గానీ, నీకు బాడుగెక్కడనుండి తెచ్చేది బావా? తిప్పితిప్పి డబ్బులు తెమ్మంటే నానేటి సేసేది?" అనేది. చిన్నారి చిగురుటాకుల్లా నవ్వేది.

సూరన్న మురిసిపోయేవాడు. "ఒక్క ముద్దియ్యనే సాలు!" అనేవాడు.

గైరమ్మ గలగలా నవ్వి "ముద్దులకేటి బావా, కొనాలా పెట్టాలా, కానీ ఖర్చునేదు, అవంటే నాకు భయంలేదు బావా... డబ్బులిమ్మంటేనే నాకు భయం!" అనేది.

వెంటనే సూరన్న గ్రహించేవాడు. "ఓసి ముండా! బలేదానివేనే! నాను సెప్పాను గదే... ఇక సత్తే నిన్ను డబ్బడగనని! నీ మీద ఒట్టు! ఇక పాణం పోయినా కల్లుమొగం సూడను!" అనేవాడు.

గైరమ్మ "సూత్తానుగా ఏపాటి నిలకడో?" అనేది.

సూరన్న మీసం మెలేసేవాడు. "మాటంటే మాటేనే!" అనేవాడు.

గైరమ్మ వదిలేది కాదు. "ఇప్పుడిలాగే అంటావు. ఆనక పానం గిలగిల్లాడిపోతూందని జాలిగా మొగమెడతావు. ఆ ఎదవ కల్లుకోసం నన్నే మరిసిపోతావు" అనేది.

సూరన్న ఓడిపోయేవాడు. రిక్షా విడిచిపెట్టేసి, గబాలున ఆమె దగ్గరకు ఒక్క ఉరుకు ఉరికి, కౌగిలించుకోబోయినంత పనిచేసి, "నాకు డబ్బులొద్దే, నువ్వే కావాలి. నువ్వే... నిజం! తల్లితోడు!" అనేవాడు.

గైరమ్మ అతనికి దూరంగా తొలిగి, పకపకా నవ్వి, "అయితే, నువ్విలా కూసోబావా! పొద్దుటినుంచీ అలిసిపోయావు కదా. ఈ రిక్షా నాను తొక్కుతాను. నిన్ను హాయిగా తిప్పుతాను. సల్లగా వుంటాది" అని రిక్షా సీటుమీద కూర్చునేది.

"నీ దుంపతెగా! నువ్వెప్పుడు నేర్చుకున్నావే? ఇంత ఉసారుగా తొక్కేత్తున్నావు!" అంటూ ఆమెనలాగే సందిట పొదువుకొని రిక్షా సీటులోనికి లాగేసుకునేవాడు. ఇద్దరి నవ్వులూ, ఆ గుట్టగుట్టంతా ధ్వనించేవి. చుట్టూవున్న చెట్ల ఆకులన్నీ గుడిలోని చిరుగంటల్లా మధురంగా కదిలేవి!

గతమంతా గైరమ్మ కళ్లలో కన్నీటిలా నిలిచింది. రిక్షా దగ్గరకు వెళ్లి వెక్కివెక్కి ఏడ్చింది. రిక్షా పెడలు మీద తల పెట్టి కుమిలిపోయింది. ఆ పెడలు ముట్టుకుంటే పాపమామె మనసు సూరన్న పాదాలు ముట్టుకున్నట్లే తృప్తి పడింది.

రోజులు వల్లానికి ప్రవహించకుండా వుండలేని నదీజలంలా, ముందుకు వెళ్లకుండా వుండలేకపోతున్నాయి. మునుముందుకు వెళ్లటం రోజులకెంత సహజమో, దినదినం ఆకలి తీర్చుకోవలసిన అవసరమూ ఈ మనుషులకంత సహజం. ముందుకు వెళ్లకపోతే ఈ భూమికి పుట్టగతులు లేనట్లే, ఆకలి తీరకపోతే మనిషికీ ఈ భూమ్మీద నూకలుండవు.

పాపం, గైరమ్మ ముందుగా రిక్షాను అమ్మివేసి ఆ డబ్బుతో ఏదో పని చూసుకునేవరకు కాలం వెళ్లబుచ్చాలనుకుంది. కానీ ఆ రిక్షాను అమ్మాలంటే తన ప్రియుణ్ని అమ్ముకుంటున్నట్లు బాధపడింది.

> "... ఆమె ముఖం చూస్తే చాలు ఆమె ఎంతో పవిత్రమైనదని అర్థమవుతుంది. ఆమెలో ఏ దురుద్దేశమూ లేదు. ప్రజల్ని వంచించాలనిగానీ, ఈరకంగా ధనాన్ని సంపాదించాలనిగానీ, ఆమెలో కొంచెం కూడా లేదు. కాని ఆమెను ఈ ఇరవయ్యో శతాబ్దపు మనిషి బతకొద్దని శాసిస్తున్నాడు... ఆమె ఈ స్థితిలో ఏమి చెయ్యాలి? ఈ రాక్షసుల పిచ్చిభావాలకు ఆమె బలి కావలసిందేనా?"

భార్యనమ్ముకున్న హరిశ్చంద్రుడిలా గిలగిల్లాడిపోయింది. ఆ రిక్షాను అమ్మడానికి ఆమెకు చేతులు రాలేదు. అయినా తప్పేటట్లు లేదు. కానీ కొనబోతే కొరివి, అమ్మబోతే అడివి అన్నట్లు దాని ఖరీదులో సగంకూడా వచ్చే ఆశ ఆమడ దూరమైంది. గైరమ్మకు ఏ పనీ చేయడానికీ పాలుపోలేదు. కొందరు రిక్షాలు తొక్కేవాళ్లొచ్చి ఆ రిక్షాను బాడుగకిమ్మని గైరమ్మను బతిమాలారు. కానీ ఇందుకూ ఆమె మనసొప్పలేదు. వాళ్లెంత చక్కగా ఆ డబ్బులు తీసుకొచ్చి తన చేతిలో పెడతారో ఆమెకు బాగా తెలుసు. ఆ పైన వాళ్లతో వచ్చే గొడవలతో అంతూ, దరీ వుండవు. సైకిల్ని ఎట్లా పొందిగ్గా చూడాలో, అట్లా వాళ్లు ఛస్తే చూడరు! విసురుగా తొక్కుతారు. దేన్నో విరుగగొడతారు. ఇదేమిటంటే మమ్మల్నేం చెయ్యమంటావ్? అంటారు. చక్రంలో గాలి వున్నదీ, లేనిదీ చూడరు. రోజుకో ట్యూబు పగలగొడతారు. ఈ విధంగా వాళ్లతో అన్నీ చిక్కులే, నష్టాలే!

గైరమ్మకు ఆ సైకిలుకు సంబంధించిన అన్ని పనులూ తెలుసు. ఆయిలు పోయగలదు. శుభ్రంగా తుడిచి చైను వూడిపోతే చైను తగిలించగలదు. చక్రంలో గాలి తగ్గిపోతే గాలి నిమిషాల మీద కొట్టగలదు. సామానులు లేవుగాని పూర్తిగా ఆ సైకిలంతా విప్పిపారేసి ఇట్టే బిగించగలదు.

ఆ రాత్రి గైరమ్మకు ఓ విచిత్రమైన ఊహ తట్టింది. ఆ వూహతో ఆమె గుండె గజగజలాడిపోయింది. అయినా ఆమె ఆ వూహకే కట్టుబడివుండాలని నిర్ణయించుకుంది. సూరన్న బావను తలుచుకుంది. నీవే నాకు రక్ష అని మొక్కింది. పొద్దున్నే లేచింది. స్నానం చేసింది. సూర్యనారాయణమూర్తికి దండం పెట్టింది. కచ్చా బిగించింది. పైటచెంగు బొడ్డులో దోపింది. ఇంటిని కనిపెట్టుకొని వుండమని పిల్లలతో చెప్పి వాళ్లను గుండెలకు హత్తుకొని ముద్దు పెట్టుకుంది. విప్లవరేఖలా సైకిలురిక్షాను చేరి స్వతంత్రంగా బతకడానికి ముందడుగు వేసింది.

ఆ రోజున లోకం తలక్రిందులైపోయింది. రిక్షామీద గైరమ్మను చూడగానే ఆడది రిక్షా తొక్కటమేమిటని జనం వీధిలో విడ్డూరంగా మూగారు. కొందరు ముక్కుమీద వేలేసుకున్నారు. కొందరు "అవ్వ! అవ్వ!" అని నోరు నొక్కుకొన్నారు. "కలికాలం!" అని మరికొందరు వాపోయారు.

ఆడవాళ్లు రిక్షా తొక్కడం ఎక్కడా చూడలేదు. ఎవరో గట్టిగా కళ్లు తెరిచారు. కళ్లద్దాల్లోంచి తేరిపారచూశారు. ఒకవేళ పొరపాటు పడ్డామేమో అనుకుంటూ మగవాడేమోనని తిరిగితిరిగి జాగ్రత్తగా పరిశీలించారు. మరీమరీ ఆమె వైపు గుచ్చిగుచ్చి చూశారు. ఒకటోరకం ఆడదేనని నిర్ధారణ చేసుకున్నారు.

"బాగుందమ్మాయి! బాగుంది. ఆడవాళ్లు చేయులేనిదేముంది? రాజ్యాలేలుతున్నారు. రౌడీలుగా మారుతున్నారు. రిక్షాలు తొక్కుతున్నారు. రీజనల్ ఆఫీసర్లు అవుతున్నారు. ఓహోహో! బాగుంది, బాగుంది!" అన్నాడు ఓ ఛోటా పాలిటీషియన్.

"అరే, అది కాదురా తమ్ముడూ! ఇందులో ఏదో కథ వుండివుంటుంది. ఈ రిక్షా రాణిగారి అంతర్వాణి ఈ విషయంలో ఏం పలుకుతుందో కాస్త పలికించి చూడు!"

"ఔనౌను. అడగాలోయ్! ఇదిగో ఓ రిక్షా అమ్మీ! నువ్వెందుకు తొక్కుతున్నావు రిక్షా? ఇలా అడిగినందుకు మరేమీ అనుకోకు."

గైరమ్మ రిక్షా దిగింది. విడ్డూరాన్ని ముఖంలో తోముకున్న జనాన్ని నిలువుగా చూసింది. "ఎందుకు తొక్కుతానో మీకు తెలియదా బాబూ?" అంది.

"అబ్బే, అబ్బే! తెలిస్తే ఎందుకడుగుతాం?"

"కడుపు కోసం బాబూ!"

"ఏమిటీ, కడుపు కోసమా? రామ రామ! లోకం ఎంత పతనమైపోయింది? ఏమిటమ్మా, సరిగ్గా చెప్పు, నాకర్థమవలేదు."

"ఏటి సెప్పను బాబూ? మీరు సదువుకున్నోరు, అన్నీ తెలిసినోరు. తెలియనట్లు మాటాడితే ఏమి సెప్పను? కూడు లేనోళ్ల బాధలు కుక్కలకు తెలియవు!"

"అర్థమైందమ్మా, అర్థమైంది. అయితే ఈ వూరంతా నీకు తెలుసా?"

"తెలియకేం బాబూ? మీరెక్కడికి తీసుకెళ్లమంటే అక్కడికి తీసికెల్తాను."

"వండర్‌ఫుల్, వండర్‌ఫుల్! మనం ఎక్కడికి తీసుకుపోతే అక్కడికి వచ్చేస్తుంది!" ఎవరో వినబడీవినబడకుండా నవ్వుల్తో ఆ మాటలను నలిపేశారు. బహుశా కాలేజీవిద్యార్థులైవుంటారు.

గైరమ్మ కళ్లల్లోంచి ఎర్రనిచూపు సూటిగా వారివైపు జ్వలించింది. ఆమె ఏమీ మాటాడలేదు. "కట్టమంటారా బాబూ?" అంది మెల్లగా.

"మరి నువ్వు కిందికి బోల్తా కొట్టించకుండా వుంటావని పూచీ ఏమిటి? దెబ్బలు తగిలినా ఏమీ పరవాలేదు కానీ కట్లూ, అవీ కట్టించుకోవడం అంటే మాకు సుతరామూ ఇష్టముండదు."

"చాలా బాగా తొక్కుతాను బాబూ! మీరు సూత్తారుగా!"

"ఔనౌను చూస్తాం. ఒంటి నిండా దెబ్బలు తగిలితే ఎంత చక్కగా తగిలాయా అని చూస్తాం. కొత్త చొక్కా తొడుక్కున్నప్పుడు చూసుకోమూ, అలా చూస్తామన్నమాట! ఇంతకీ నీకు లైసెన్సు వుందా?"

"ఉంది బాబూ!"

"ఏదీ చూపించు."

"ఇదిగోనండి."

అప్పుడే ఓ రిక్షావోడు జొరబడి, "ఇది దీన్ది కాదండి. దీని మొగుడిది" అన్నాడు.

అందరూ గొల్లున నవ్వారు.

"ఎందుకు నవ్వుతారు? యీ రిక్షా మా సూరన్నబావది. ఆడు సచ్చిపోనాడు. ఇప్పుడు నాదే కదూ. యీ లైసినీసు ఆడిదే. మరి నాకు సెందదూ?" అంది.

అందరి ముఖాల్లోనూ ఒక్కసారి ఏమిటేమిటీ అన్నట్లు 'కళ' కళవళపడింది. పైకీ క్రిందికీ లేచిపడే కెరటమైంది.

"ఇదేం వోరసత్తం అనుకున్నావేటే గైరమ్మా? లైసినీసులకు వోరసత్తాలుండవు."

"ఔను. నిజం. మంత్రికొడుకు మంత్రి

**ఈ కథను ఆంధ్రప్రభ సచిత్రవారపత్రిక 28.9.1960 సంచికలో ప్రచురించాము**

కావాలనిలేదు. గుమాస్తా కొడుకు గుమాస్తా కావాలనీలేదు. ఈ కాలంలో దేనికీ వారసత్వం లేదు."

"వూరుకోండి బాబూ! నాకు తెలీపోతే మరీ సెప్పుతారు! మా మునిసీబు గోరబ్బాయి మునిసీబయ్యాడు. కరణం గోరబ్బాయి కరణమయ్యాడు. వున్నమాట సెప్పండి బాబూ!"

"బాబోయ్ ఇది టక్కరిముండండీ! దీని రిక్షా ఎక్కకండీ! ఆడోళ్ల రిక్షాలెక్కితే పాడైపోతారు. నా మాట ఇనండీ!"

గైరమ్మ కుతకుతలాడిపోయింది. "మగోళ్ల రిక్షాలెక్కిన ఆడోళ్లందరూ సెడిపోతున్నారా ఏటి? రండి బాబూ!"

"నాను సెప్పాను గదండీ, ఇది దొంగముండని!"

"ఎవడవురా నువ్వు? నన్ను తిడతావు?"




"ఎవతివే నువ్వు మాకు పోటీగా వస్తావు. ఒరే రిక్షా తమ్ముళ్లూ, రండిరా! రండి! ఇక మనకు బతుకుల్లేవు! ఆడోళ్లు రిక్షాలు తొక్కేత్తున్నారు. మన మగోళ్ల రిక్షాలు మగోడెవ్వడూ ఎక్కడు! తొందరగా రండొరేయ్! దీనికి బుద్ధి సెప్పకపోతే నాబం నేదు!"

ఈ సంభాషణంతా విన్న నల్లకోటు తొడుక్కున్న కళ్లజోడు లేని కుర్రప్లీడరు, గైరమ్మ మాట్లాడిన విధానానికీ, ధైర్యానికీ ఆశ్చర్యపోయాడు. గభాలున ఆ గుంపులోకి చొరబడి "ఎవడివయ్యా నువ్వు, ఆ అమ్మిని రిక్షా తొక్కకుండా ఆపడానికి? నువ్వెలా బతుకుతున్నావో, ఆ అమ్మీ అలాగే బతుకుతుంది. బతకడం అందరి జన్మహక్కు. ఆమె కష్టించి బతుకుతానంటోంది కానీ దొంగపనీ, దొంగగువనీ చేయటం లేదు. భారతరాజ్యాంగం ప్రకారం ఆమె తరఫున న్యాయం పూర్తిగా వుంది."

"ఈ యవ్వారం ముదిరిపోతోందర్రోయ్! రండి రండి! పీడర్లు కూడా వచ్చేత్తున్నారు ఈ బాగోతంలోకి! ఆడోళ్లంటే అందరికీ అతివూనమే! (అభిమానమే)"

"పోనీ, ఆడోళ్లయినా ఎక్కండమ్మా, నా బతుకెల్లిపోద్ది."

"తప్పు తప్పు! అలా అనకమ్మా! నిన్ను బాధపెట్టటం మాకిష్టం లేదు. ఇది భారత స్త్రీజాతికే కళంకం. మేం నీ రిక్షా ఎక్కేటంత... ఆటవికత్వం మాలోలేదు."

"అలా అనకండి తల్లీ! చక్రాలు తిప్పుతున్న సిట్టి సెల్లాయిలున్నారు. దంపుళ్లు దంపుతూన్న పెద్దక్కలున్నారు. ఒటేళ్లలో రుబ్బనేక సేతులు పడిపోతున్న ఆడబడుసులున్నారు. మిల్లుల్లో బల్లులైపోతున్న తల్లులున్నారు. వన్నీవని సేసుకోనీండమ్మా. మీరే సిన్నసూపు సూత్తే ఇక నా బిడ్డల గతేటి తల్లీ?"

"అబ్బో! యిది శానా సదువులు సదివిందండోయ్! మన సంగం ముందు దీని సంగతేటో తేల్చుకోవాలి. సంగం నాయకుణ్ని రంగంలోకి తీసుకురావాలి. వదండ్రా, వదండి!"

అప్పుడే ఓ పోలీసు వచ్చి, "ఏమిటీ గుంపు, యిక్కడి నుంచి పోండి!" అన్నాడు.

"ఏమండోయ్! పోలీసయ్యగోరూ! ఆడది రిక్షా తొక్కుతూందండీ! దీని సంగతేటో సూడండీ!"

"ఆడోళ్లు రిక్షా తొక్కడమేమిటోయ్ నీ ముఖం!"

"నిజం బాబూ! నాను శానాబాగా తొక్కుతానండీ!"

"ఏమిటేమిటీ? నువ్వు రిక్షా తొక్కుతావా?"

"ఔను బాబూ!"

"అదెల్లా వీలవుతుంది? ఆడోళ్లు తొక్కడం నేనెప్పుడూ చూడలేదే!"

అప్పుడే ప్లీడరు కలుగజేసుకొని "ఇప్పుడు చూస్తున్నావు కదటయ్యా? ఇంకేం చూడాలి?" అన్నాడు.

"అదేమిటండీ, మీరు కూడా అలా అంటారు?"

"ఏం? ఆమె హక్కును కాదనమంటావా?"

"హక్కులంటూ చిక్కులు తెచ్చిపెట్టకండీ ప్లీడరుగారూ! మొండివాదాలు మానేసి, నిండైన మాట చెప్పండి!" ఎవరో పెద్దమనిషి గొణిగాడు.

"అది కాదండీ! నా మాట వినండీ! ఆమెను చూస్తూవుంటే జాలేస్తూంది. భర్త చచ్చిపోయాడు. పాపం, పిల్లల్ని పోషించాలి. ఆమెకీ పని చేతనౌను. ఇలాంటి పరిస్థితుల్లో ఏ ఆడదైనా ఇంకేం చేస్తుంది?"

"మరో ఆడదైతే అంట్లు తోముతుంది."

"ఏమండోయ్! మీరు పెద్దమనిషిగా మాట్లాడటం లేదు. ఆమెను కించపరచటం ఏమీ సబబుగా లేదు. మీరు బిజినెస్ మానేసి, బంట్రోతు ఉద్యోగం చెయ్యమంటే చేస్తారా?"

"మీ సబబులూ, సందర్భాలూ కట్టిపెట్టండి! అసలు లోకంలో ఎవరికీ యిష్టంలేని పని చెయ్యడానికి ఆమెకేం హక్కు వుందండీ?"

"ఎవరికీ యిష్టం లేదని మీరెల్లా చెప్పగలరండీ? అయినా అందరికీ యిష్టం లేదన్నంత మాత్రంలో న్యాయం అన్యాయంగా మారిపోతుందేమిటీ? అందరికీ సూర్యుడు నల్లగా వున్నాడంటే కుదురుతుందేమిటి?"

"ప్లీడరుగారూ! ఎందుకండీ అనవసరంగా రొప్పుతారు? పదుగురాడు మాట పాడియై ధరజెల్లు, మనమందరమూ ఏదంటే అదే న్యాయం!"

"ఆ రోజులు పోయాయండీ పుల్లయ్యగారూ! మనమందరమూ అన్నంతమాత్రంలో అది న్యాయమైపోదు. ఏది న్యాయమో అది న్యాయమవుతుంది."

"నిజం నిజం! ఏది న్యాయమో అది న్యాయమవుతుంది. ఏది వంకాయో అది వంకాయే అవుతుంది. ఎవరు ప్లీడరో వాడు ప్లీడరవుతాడు. ఎవడు కూలీయో వాడు కూలీ ఔతాడు. నిజం నిజం! ప్లీడరుగారూ, ఇంటికి వెళ్లి చిన్న ముక్కాలిపీట వేసుకొని ఆ బోర్డు కాస్తా

వెనక్కితిప్పండి! ఎందుకైనా మంచిది!"

అందరూ మల్లెపూల గంప తిరగబడినట్లు విరగబడి నవ్వారు.

పోలీసు కలుగజేసుకొని "నడిరోడ్డు మీద నిలబడి న్యాయాన్యాయాలు నిర్ణయించడం కష్టం సార్! ఇదిగో అమ్మీ! నీకు లైసెన్సు లేదు. అంచాత నువ్వు రిక్షా తొక్కడానికి వీల్లేదు! తిన్నగా ఇంటికి వెళ్లు. లేకపోతే కేసు పెట్టవలసివస్తుంది" అని బెదిరించాడు.

వెంటనే ప్లీడరు "ఇదిగో నువ్వేం భయపడకు! నీకు లైసెన్సు తెచ్చిపెట్టే బాధ్యత నాది! వీళ్లంతా అప్పుడేం చేస్తారో చూస్తాను!" అన్నాడు ధైర్యం చెబుతూ.

"పోనీ బాబూ! ఇందరికిట్టం లేని పని నేను చేసి ఏం బావుకుంటాను? మరో పనేదో సూసుకొని పొట్ట గడుపుకుంటాను."

"అలా ఎప్పుడూ వెనుకడుగు వేయకూడదు. నీకెందుకు, నేనున్నానుగా! రేప్పొద్దుట మీయింటికొస్తాను. నువ్వు సిద్ధంగా వుండు. నేను నిన్ను ఆఫీసుకు తీసుకుపోయి లైసెన్సు ఇచ్చే ఏర్పాట్లు చేస్తాను."

వెంటనే అక్కడున్న రిక్షావాళ్లు "ఎలాగిత్తారో మేం చూత్తాంగా! మేమేం అంత గాజులు తొడిగించుకొని కూచోలేదు!" అన్నారు.

"ఒరే ఒరే! అలాగనకురా! దానికి గాజుల్లేవు. అది మగోడికన్నా మగోడిలా వుంది."

"ఉండరా, నువ్వేటి? ఇదిగో గైరమ్మా! మేం సెప్పేదినుకో. నీకు లైసెనీసొచ్చినా, మేం నిన్ను సైకిలు తొక్కనివ్వం. అంతే! ఏటనుకున్నావో? మళ్లీ సెప్పలేదనేవు. మరిసిపోకు సుమీ!"

ప్లీడరు ఎర్రగా వాళ్లవైపు చూసి, "ఈ దౌర్జన్యం కబుర్లు కట్టిపెట్టండి! లైసెన్సు పుచ్చుకోడం, ఈ రోడ్డు మీద ఈయమ్మి రిక్షా తొక్కడం తప్పకుండా జరుగుతాయి! మీరు కాదు, మీ తలలోని జేజెమ్మ కూడా దీన్ని ఆపలేదు!" అని, గైరమ్మను దగ్గరగా పిలిచి, ఆమె పేరు, ఇంటిపేరు కనుక్కొని, నీకేం భయం లేదని అభయహస్తం యిచ్చి, ఇంటికి వెళ్లిపోయాడు.

గైరమ్మ మెల్లగా సైకిలు నడిపించుకుంటూ దీనంగా ఇంటివైపు దారితీసింది. చుట్టూ వున్న జనం వెర్రినవ్వు నవ్వుతూ అటూఇటూ కదిలిపోయారు.

రిక్షావాళ్లు గైరమ్మను నానాబూతులూ తిడుతూ "తెగించింది ముండ!" అన్నారు. "మనం కాత్త జాగర్తగా ఉండాల్రోయ్! ఆ పొట్టిప్లీడరు మాగట్టోడు!" అనుకున్నారు.

## 2

ఇంటికి వెళ్లగానే ప్లీడరు శేషగిరికి అనంతమైన ఆలోచనలు పుట్టుకొచ్చాయి. భార్యామణిని పిలిచాడు. "లీలా! ఒక్కమాట. ఇలా నా ముందు కాస్సేపు కూర్చో!" అన్నాడు.


లీల కాస్త దూరంగా నిలిచి నవ్వుతూ కళ్లతోనే ఏమిటి విశేషమంది.

"చెపుతా మాట" అన్నాడు.

"అన్నం తినేసి ఆ మాటలు చెప్పుకోగూడదూ? ఏమంత కంగారు?"

"అఖండమైన కీర్తి నా కాళ్ల ముందు నిలిచివుంది లీలా! కౌగిలించుకోవాలో, దూరంగా తొలగిపోవాలో తోచకుండా వుంది. కాస్త దగ్గరగా రా! మరీ అంత దూరంగా వుండకు. దూరంగా వుండి చెప్పే సలహాలకు వుండవలసినంత బలం వుండదు."

"మీకు కావలసింది కీర్తికాని నేను




కాదుకదూ? దూరంగా వుంటే మాత్రం ఏం? అదేం కర్మో, ఈ భర్తలకు కీర్తి కావాలి. పాపం భార్యలకు మాత్రం భర్తలే కావాలి. ఛీ ఛీ! ఏం కాపురం?"

"నో నో! భర్తలకు కీర్తి ఎలా కావాలో భార్యలకూ అలాగే మరి డబ్బు కావాలి. నాకు కీర్తి ఎలాగూ వస్తుంది. నీ దగ్గర కావలసిన డబ్బు వుండనేవుంది. అంచాత మన కాపురానికేం, బంగారం లాంటి కాపురం!"

"మీ ఒడుపులకేం లెండి! ఈసారి నేను ఛస్తే డబ్బివ్వను!"

"అబ్బబ్బ! ఎప్పుడూ డబ్బుమీదే కదా బెంగ! వెధవది డబ్బు తగలేస్తేనే కాని కీర్తి రాదు. కీర్తిని పాడు చేసుకుంటేనే గాని డబ్బు పుట్టదు. చూడు లీలా! నన్నేం తగలెయ్యమంటావ్?"

"మీకిష్టం వచ్చింది తగలేసుకోండి. నాకేం? నాకు ఆకలేస్తోంది. నేను పోతా..."

"ఆకలి మనకోసం పుట్టింది లీలా! ఆకలి కోసం మనం పుట్టలేదు. మనకోసం వచ్చిన పెద్దమనిషి వీధి అరుగుమీద ఎంత సేపైనా నిలబడతాడు. తెలుసుగా, అంచాత మనకోసం పుట్టిన అన్నమూ అంతే!"

"సరే. మీ కోసం పుట్టిన ఆ 'అన్నం పెద్దమనిషి' గారు వచ్చేవరకూ మీరక్కడే కూర్చోండి. నేను పోతా."

"మై గుడ్ గాడ్! ఇహ లాభం లేదు. ఇదిగో లీలా! నేనూ వస్తున్నా. కాని ఒక్కటి చెప్పు. నువ్వు ఆడాళ్లను ప్రేమిస్తావుకదూ?"

"ఏం, ఎక్కడైనా ఓ అమ్మాయిని చూసుకున్నారేమిటి?"

"రామ రామ! ఎంత మాటన్నావ్? అది కాదు లీలా! నీకు ఆడవాళ్లు ఎలాంటి పనులు చేయడం ఇష్టం?"

"టెన్నిస్ ఆడటమంటే నాకు చాలా ఇష్టమండీ!"

"ఓహో, చాలా బాగుంది, తరువాత?"

"హాయిగా కారులో బీచి ఒడ్డుకు షికారు పోవడం ఇష్టమండీ!"

"తరువాత?"

"అక్కడ వేరుసెనగపప్పు తింటూ పైకీ క్రిందకీ ఉయ్యాలలూగే కెరటాలను చూస్తూ కూర్చోడం అంటే ఎంతో ఎంతో ఇష్టం."

"అద్భుతం! అద్భుతం! అయితే లీలమ్మగారూ, ఒక్కమాటండీ. ఆడవాళ్లు రిక్షాలు లాగడం తమకు ఇష్టమా అండీ?"

"అదేమిటీ? ఛీ!"

"పోనీ అంట్లు తోమడమో?"

"అసలిష్టం లేదు."

"వెరీ గుడ్! ఈ ఆంధ్రావనిలో అంట్లు తోమేవాళ్లు వుండకుండా చేసేస్తాను."

"ఈ విధంగా డబ్బు ఆదా చెయ్యాలని చూస్తున్నారేమిటి? ఎల్లుండి నుంచి మసిచేతులతో మీ పరువు పదిమందిలో తీసేస్తాను!"

"అందరిళ్లలోనూ మసి చేతులే వుంటే నువ్వు తీసేదేమిటి పరువు? చూడు లీలా, నా యొక్క అసాధారణమైన తెలివితేటలవల్ల ఈ అంట్లు తోమే పిల్లల స్టేటస్ రేపటి నుంచీ పెంచేస్తాను. అంట్లు తోమే పిల్లలు సాధారణంగా తెలివైనవాళ్లయి వుంటారు. వాళ్లు బలంగా వుండడం పరేసరి. తెలివీ, బలం కలిస్తే ఈ జీవితపుసైకిలు తొక్కడం చాలా సులువు. అంచాత


"అలాగా పాపం? రిక్షాలు లాగే మగవాళ్లంతా రాక్షసులన్నమాట! మరి ఈ మగరాక్షసులను పెళ్లాడేందుకు ఎంచక్కా ఆడదేవతలు దివి నుండి దిగుతారు కాబోలు!"

"అయితే మొగుడు రిక్షా తొక్కితే పెళ్లాం కూడా పాపం రిక్షా తొక్కాలా?"

"ఔను లీలా, ఔను. ప్లీడరు పెళ్లాం ప్లీడరు. డాక్టరు పెళ్లాం డాక్టరు. ఇంజనీరు పెళ్లాం ఇంజనీరు... అయితే ఎంతటి సుఖం?"

"ఔనౌను. చాలా సుఖం! రేపటి నుంచీ మంగలి పెళ్లాం మజాగా తయారై ఉషారుగా క్రాఫులు వేస్తే బలే సుఖం! బలే సుఖం!"

"వండ్రఫుల్ ఐడియా! ఏదీ షేక్ హాండియ్యి! లీలా, నువ్వు నిజంగా ప్లీడరు పెళ్లానిపనిపించుకున్నావు. నా మాట కొంచెం విను."




వాళ్లంతా ఇహ రేపటినుంచి సైకిలు రిక్షాలు ఉషారుగా తొక్కుతారు."

"ఏ పేపర్లో చూశారండీ యీ కార్టూన్? నన్నూ కాస్త చూడనిస్తారా?"

"పేపర్లో ఏం ఖర్మ? పబ్లిక్ రోడ్డుమీద చూశాను. మన మస్తిష్కం దాన్ని ఫోటో తీసుకుంది. ఈ లోకం ఆర్టుగ్యాలరీలో దాన్ని త్వరలోనే ఆవిష్కరిస్తాను. మరి చూసుకో మన తడాఖా!"

"ఎవరైనా వింటే నవ్వుతారు వూరుకోండి! ఇప్పటికే ఆడవాళ్లకు బోలెడన్ని పనులు అంటగట్టి, మగాళ్లు మొద్దుల్లా తయారవుతున్నారని ప్రపంచం గోలెత్తిపోతోంది. అయినా మీకిలాంటి రాక్షసపు ఆలోచనలు పుడతాయేం?"

"మీ 'లా' ప్రకారం ఆ పనికి అంగీకారం కుదురుతుందేమో గానీ, ఈ ఎదగని మనుషుల మధ్య ఇలాంటి పనులు జరగడం కల్ల!"

"మనుషులు ఎదగకపోతే నీ ఉద్దేశంలో మనిషి చావాలన్నమాట! ఎదగని మనుషులందరూ కలిసి మనిషిని చంపెయ్యొచ్చన్నమాట!"

"అది తప్పే అనుకోండి."

"అయితే నా మాట విను. ఈ మధ్య ఓ రిక్షావాడు చచ్చిపోయాడు. అతని భార్య రిక్షా తొక్కగలదు. పిల్లల్ని పోషించడానికీ, తన బతుకును ఎలాగో ఈడ్చి పారెయ్యడానికీ, ఈ రోజున వీధిలో నిలబడింది. ఆమె ముఖం చూస్తే చాలు ఆమె ఎంతో పవిత్రమైనదని అర్థమవుతుంది. ఆమెలో ఏ దురుద్దేశమూ లేదు. ప్రజల్ని వంచించాలనిగానీ, ఈరకంగా ధనాన్ని సంపాదించాలనిగానీ, ఆమెలో కొంచెం కూడా లేదు. కాని ఆమెను ఈ ఇరవయ్యో శతాబ్దపు మనిషి బతకొద్దని శాసిస్తున్నాడు. నువ్వు చెప్పు లీలా, ఆమె ఈ స్థితిలో ఏమి చెయ్యాలి? ఈ రాక్షసుల పిచ్చిభావాలకు ఆమె బలి కావలసిందేనా?"

"నిజమే. ఆమె బతకవలసిందే! కానీ ఈ ప్రజలు సాగనిస్తారని నేననుకోను. అంత కల్చర్ ఇంకో యుగానికి కాని రాదు!"

"ఈ యుగంలోనే వస్తుంది లీలా! నేనందుకు నా ప్రాణాన్ని ఒడ్డి నిలుస్తాను. నీవు కొంచెం చేయూతనియ్యి. హైకోర్టు వరకూ వెళ్లవలసివచ్చినా రావచ్చు. ఇక్కడ ఏమంత ఖర్చు కాదుగాని, అక్కడకు వెళ్లితే రానూపోనూ ఛార్జీలకూ, భోజనాలకూ, ఈలోగా ఆ మనిషిని కాస్త కాపాడటానికీ కాస్త పైకం కావలసిఉంటుంది. దీనికి మరి నువ్వు కాస్త చల్లనిచూపు చూడాలి!"

"ఛా! అదేమిటండీ అలా అంటారు? ఇలాంటి పనికి నేనివ్వనంటానా? దీనికింత ఉపోద్ఘాతమా?"

"నువ్వు ఇవ్వవనికాదు లీలా! ఇందులో ఇంత కష్టమున్నదని! ఇహ రేపటి నుంచే నేనీపనిలో నిమగ్నుడినౌతాను. నెగ్గితే నా కీర్తి దశదిశలా వ్యాపిస్తుంది. ఈ కేసులోని విషయాలు రేపటి విద్యార్థులకు పాఠాలుగా వుంటాయి."

"అలాగే జరుగుతుందిలెండి! లేవండి భోజనానికి!"

"భార్య ఆశీర్వదిస్తే తప్పక ఫలిస్తుంది డార్లింగ్!" నవ్వుతూ శేషగిరి భోజనానికి కూర్చున్నాడు.

## 3

గైరమ్మ ఇంటిముందు కూర్చుంది. పెద్దకుర్రాడు గుణింతం దిద్దుతున్నాడు. చిన్నవాడు తల్లి వీపుమీద ఉయ్యాలలూగుతున్నాడు. గైరమ్మ ఆకాశంలోకి చూస్తూ ఏమిటో ఆలోచిస్తోంది.

"అమ్మా! నాకు పుస్తకం కొనిపెట్టవే!" అంటూ పెద్దకుర్రాడు తల్లివైపు అదోలా చూశాడు.

"కొంటాలేరా! వేళయింది. అన్నం తిందువుగాని లే!" అంది గైరమ్మ.

కుర్రాడు భయపడుతూ భయపడుతూ, "నాకు ఆకలిగా లేదమ్మా" అన్నాడు.

"ఏమి తిన్నావురా లేకపోవడానికి? పద అన్నం పెడతా" అంటూ వీపుమీద వూగుతూన్న కుర్రాడిని "నువ్వుండరా!" అని వాణ్ని దింపి లోపలికి వెళ్లింది.

తల్లి అలా లోపలికి వెళ్లగానే పెద్దపిల్లాడు గజగజలాడిపోయాడు. వాడి కళ్లవెంట నీళ్లు తిరిగాయి.

అప్పుడే ఆ తల్లి "అన్నం ఏదిరా?" అంది.

నేరం చేసినవాడిలా ఆ పెద్దకుఱ్ఱాడు మాటామంతీ లేకుండా నిలడిపోయాడు. వాడి బుగ్గలమీద కన్నీళ్లు ప్రవహిస్తున్నాయి. చిన్నవాడు ఏదో చెప్పాలని పెదవి కదిపి, అన్నవైపు చూసి బెదురుబెదురుగా నిలబడిపోయాడు.

గైరమ్మ తిరిగి "ఏమైందిరా అన్నం? కుక్కలకు పెట్టేశారేటి?" అంది.

పెద్దవాడు మెల్లగానోరు విప్పి "లేదమ్మా. మరేమో.. ఆ అబ్బెవడో ఆకలంటూ వచ్చాడమ్మా. కొంచెం అన్నం పెట్టాను. మరేమో గబగబా తినేసి, ఇంకా ఆకలౌతుంది కొంచెం అన్నం పెట్టవూ? అన్నాడు. చాలా ఆకలిగా వున్నాడమ్మా. ఎన్నో రోజులైందంట తిని. రోజూ తింటున్నాంగా అమ్మా మనం అన్నం! ఈ ఒక్కరోజూ మానేద్దామే! ఆ అబ్బిని సూత్తే ఏడుపొచ్చిందే!" అన్నాడు.

గైరమ్మ కొడుకును కౌగిలించుకుంది. కంటికీ మంటికీ ఏకధారగా ఏడ్చింది. "ఇంత మెత్తనోడివి ఎలా బతుకుతావురా? జొన్నపొత్తులు కాల్చి ఇత్తాను రండి, తిందురుగాని" అని వాళ్లను మరింత దగ్గరకు చేర్చుకుంది.

మెల్లగా "మనం పేదోళ్లం బాబూ! మనకే లేదు. అడుక్కునే వాళ్లకెక్కడ పెట్టగలం? మీ అయ్యవుంటే రోజూ మూడునాలుగు తెచ్చి వడేసేవోడు. ఇప్పుడెక్కడ నుంచి వత్తాదిరా డబ్బు?" అంది.

పెద్దవాడు తల్లి కాళ్ల దగ్గర కూర్చొని తలవంచి, "అమ్మా, నేను ఐస్‌ఫ్రూట్లు అమ్ముతానే. అవి అమ్మితే బోలెడు డబ్బొత్తాదమ్మా" అన్నాడు.

ఆ తల్లి వాణ్ని గుండెలకు హత్తుకుంది. ఆమె కడుపునెవ్వరో తరిగినట్లయింది. ఆమె కంటి ముందు నడివేసవిలో జోళ్లు లేని వసికుఱ్ఱాడు, దాహం వేస్తున్నా ఆ ఐస్‌ఫ్రూట్లు ముట్టుకోకుండా వీథుల్లో అరచి, అరచి వడదెబ్బ తగిలివడిపోయినట్లు ఏదో భయంకరమైన దృశ్యం కదలిపోయింది. గైరమ్మ కెవ్వున అరిచి కొడుకు తలను తన తలకు చేర్చి వలవలా ఏడ్చింది.

ఆమె మనోనేత్రాన, ఏవేవో నీడలు పెరిగిపోయాయి. జోళ్లకు పాలిష్ వేసే దిక్కులేని కుఱ్ఱాళ్లు, ఆమె కంటిముందు చిదిగిపోయిన గుండెలతో నిలిచారు. హోటళ్లలో కప్పులు కడుగుతూ టేబులు తుడిచే పిల్లలు, ఆ తుడుపుగుడ్డకన్నా హీనంగా నీళ్లోడుతూ వేదనగా కనిపించారు. కొలిమి దగ్గర తిత్తి ఊదుతూ ఆ వేడికి తట్టుకోలేని పసిపిల్లలు, కాలిపోతూ వంకరలు తిరిగిపోతూన్న లేతీగలవలె ఆమె పాదాల ముందు రాలిపోయారు. గైరమ్మ విహ్వలంగా అరచింది.

"వద్దు నాయనా, వద్దు! నువ్వేమీ చెయ్యొద్దు. నువ్వు బాగా సదువుకో బాబూ! మిమ్మల్ని నేను ఎలాగో కట్టపడి సదివిత్తాను" అంది.

అప్పుడే శేషగిరి ఆ గదిముందు నిలబడి గైరమ్మను పిలిచాడు.

గైరమ్మ ఉలిక్కిపడింది. "బాబూ! రండి. సూడండి బాబూ... ఈ పిల్లల్ని! ఈళ్లనెలా సాకేది బాబూ?"

"నీకేం భయం లేదు గైరమ్మా! నువ్వు ధైర్యంగా వుండు. పొద్దుట నువ్వు మాట్లాడిన విధం చూసి నాకు చాలా ఆశ్చర్యమేసింది. తెలివి ఒకరి సొమ్ము కాదు. నీ పిల్లల్ని నువ్వు పెంచుకోవడానికి నీకు తోచిన మంచిపని చేస్తున్నావు. ధర్మం నీ తరఫున పూర్తిగా వుంది. ఇంతకన్నా నీకేమి కావాలి?"

"ఏటో బాబూ! నాకు భయంగా వుంది. ఆళ్లన్నట్లు అంట్లు తోముతాననుకో బాబూ! ఏటొత్తాది? పదొచ్చె... పరకొచ్చె... ఈ పిల్లల్ని నాకు సదివించాలని వుందిబాబూ! ఈళ్లసలే సత్తెగాలపోళ్లు. ఎలాగ బతుకుతారో ఏమో!"

"నిక్షేపంలా బ్రతుకుతారు. ఆ బెంగ పెట్టుకోకు. నువ్వు మాత్రం ఎవరు బెదిరించినా హడలిపోకుండా ధైర్యంగా నిలబడు, అంతే! మిగిలిందంతా నేను చేస్తాను. నీకు లైసెన్సు రేపే ఇచ్చే ఏర్పాటు చేస్తాను. నువ్వు రేపొద్దుటే ఆ ఆఫీసుకు రా!"

"శానా చిక్కులున్నాయనుకుంటాను బాబూ!"

"ఏమీ లేవు. అవన్నీ చూసేవాణ్ని నేనున్నాను!"

(ముగింపు వచ్చేవారం)




శ్రీనాథ్, సౌమ్యల ప్రేమగురించి ఇరుకుటుంబాల్లో తెలుసు. వారి ప్రేమకు రెడువైపులా గ్రీన్ సిగ్నల్ లభించింది. అయితే, చదువులైపోయిన తర్వాతనే పెళ్లి అనే షరతు పెద్దలు విధించారు. చాలామటుకు ప్రేమ వ్యవహారాల్లో హీరో హీరోయిన్లకు పెద్దలనుండి, సమాజంనుండి అనేక అవాంతరా లొస్తాయి. కాని సౌమ్య, శ్రీనాథ్‌లకు అలాటి సమస్య లేమీ లేవు. ఎటు చూసినా ఆనందకర వాతావరణమే. అందుకే వారిద్దరూ లోకాన్ని మరిచి యుగళగీతాన్ని ఆలపిస్తున్నారు. ఒకరినొకరు తాదాత్మ్యంతో చూసుకుంటున్నారు.

# ఎదగని మనుషులు

## రంధి సోమరాజు

(కిందటి సంచిక తరువాయి)

"వాళ్లు నిన్నేమీ చేయులేరు గైరమ్మా! అనవసరంగా వాళ్లు బెదిరిపోతూవుంటే ఎవరేం చేస్తారు? ఈ రిక్షాలు పుట్టకముందు నా చిన్నప్పుడు గుర్రపుబళ్లుండేవి. ఇప్పుడవన్నీ ఏమయ్యాయి? ఆ రోజుల్లో వాళ్లు ఈ రిక్షావాళ్లను రోడ్డుమీద కాలు పెట్టనివ్వకుండా చేస్తే వీళ్లిపుడెక్కడ వుండేవారు? బస్సు పుట్టి బళ్లవాళ్ల కడుపు కొట్టిందని నీవు వినేవుంటావు. ఇదే నిజానికి యుద్ధం అంటే! మనిషి మార్పుతో యుద్ధం చేస్తున్నాడు. ఎవరు ఆ మార్పుననుసరించి నడచుకపోతున్నారో వారు బాగుపడుతున్నారు. లేనివారు ఆ మార్పుల ఇరుసులో పడి నలిగిపోతున్నారు. ఇప్పుడు కూడా కొంతమంది జట్కాబళ్లవాళ్లు కనిపిస్తారు. వాళ్లకు కూడు వుండదు. వాళ్ల గుర్రాలకు కూడా దాణా వుండదు. ఏ క్షణాన్నైనా ఏ చక్రానికా చక్రం ఊడిపోతుందేమో అన్నట్లుగా వుంటుంది ఆ బండి. అయినా దాన్నే పట్టుకొని వేలాడుతారు.

"వారిని చూస్తే జాలేస్తుంది. కాని వాళ్లు మారలేదు. రేపొద్దున్న ఈ రిక్షావాళ్లు కూడా అలాగే ఇరుకున పడతారు. కొద్దిరోజుల్లో ఆటోరిక్షాలు వస్తాయి. వీళ్లకు వాటిని తొక్కడం చాతగాదు. అది నేర్చుకోవడానికి అనేకకారణాలవల్ల కుదరదు. దీనితో వీళ్ల బతుకు బయటపడుతుంది. వీళ్లంతా నాశనం అవుతారు. ఈ యుద్ధంలో వీళ్లు హతమారిపోతారు. పూర్వం చాలామంది రాజులు కొత్త ఆయుధాల గురించి తెలుసుకోడానికి ప్రయత్నించకపోవడం వల్ల రాజ్యాలు పోగొట్టుకున్నారు. ఇందుకనే ఈ పరుగెత్తేకాలంలో క్షణం నిలకడ లేని ఈ మార్పుల ఆర్భాటంలో మనిషి చాతకానివాడుగా నిలబడిపోగూడదు. ఏ పనికైనా సిద్ధంగా వుండాలి. ఈ కార్లు నడిపే డ్రయివర్లకు కూడా ఈ ముప్పు వస్తుంది. విమానాలు వాటి స్థానంలో ఆక్రమించడం ఎన్నాళ్లో పట్టదు. మనిషి మనిషికీ విమానం వస్తుందేమో... ఇందుకనే ప్రభుత్వం దూరదృష్టితో ఎప్పుడూ మెలగాలి. అయిదు సంవత్సరాలే నా బతుకు అనుకుంటే ఆ ప్రభుత్వం తాలూకు ప్రజల జీవితం అలాగే అడుగంటిపోతుంది. మంత్రులందరూ అయిదు సంవత్సరాలే ఆ పదవుల్లో వున్నా, వారి దృష్టి ఎప్పుడూ ఐదువేల సంవత్సరాల ముందుకు ప్రసరించాలి. ఇప్పుడు అన్నిరకాల పొలం పనులు చేయడానికి మెషీన్లే ముందుకొస్తున్నాయి. దీనితో వ్యవసాయకూలీలు పనిలేనివాళ్లుగా తయారవుతారు. వీళ్లందరికీ జీవితాన్ని ఇవ్వడానికీ, తద్వారా దేశం బ్రతుకు పెంచడానికీ ప్రభుత్వం పరిశ్రమలు స్థాపించాలి. ఈ ప్రజకూడా ఈ విషయంలో కృషి సల్పడానికి ముందడుగు వేయాలి. ఈ పని తప్ప నాకింకొకటి చాతకాదు, ఈ పని తప్ప నేను మరొకటి చేయను అంటే వీలుపడదు. ఇంతకన్నా మరొక రకం మనుషులుంటారు. మేము ఏ పనీ చేయం అంటారు వాళ్లు. ఇక ముందు దేశం, పనిచేసే వాళ్లనే గౌరవిస్తుంది కానీ, పని చెయ్యనివాళ్లను గౌరవించదు. నీ బతుకు నువ్వు బతకడానికి నువ్వు ధైర్యంగా ముందుకొచ్చావు. ఒళ్లు దాచుకొనే తత్వం నీలో లేదు. ఇందుకు నిన్ను నిజంగా ఎంతో అభినందించాలి. కొత్తగా రిక్షాలు తొక్కేవాళ్లను ఈ రిక్షాలు తొక్కేవాళ్లు అడ్డుపెట్టడం లేదు కదా! అలాగే నిన్నూ ఎందుకు చూడగూడదూ? అంత పిరికితనం ఏమిటి? వాళ్ల పిరికితనానికి నువ్వు బలి కావడమేమిటి? ఇదంతా మూర్ఖుల లక్షణం. అలాంటి తెలివితక్కువ వాళ్లకు మనం ఎప్పుడూ తల ఒగ్గకూడదు!"

"అయితే బాబూ, తెలియక అడుగుతాను, మోటారు రిక్షాలొస్తే ఈ రిక్షావాళ్లంతా ఎలా బతుకుతారు?"

"ఇది నిజంగా ఆలోచించవలసిన విషయం. కానీ ఈ రిక్షావాళ్లకు అలాంటి ఆలోచనే లేదు. పోనీ వాళ్లకంటే ఏమీ తెలియదనుకో. వాళ్ల సంఘం నాయకులు ఆ చందా డబ్బుల గురించే ఆలోచిస్తారు గానీ, ఇలాంటి విషయాల గురించి ఏమీ ఆలోచించరు. కనీసం వాళ్ల రిక్షావాళ్ల కష్టసుఖాలను వాళ్లు నిజంగా చూసేవాళ్లయితే సంఘం డబ్బుతో ఈ పాటికి ఓ ఆటోరిక్షాను కొని వీళ్లందరికీ దాన్ని ఎలా నడపాలో నేర్పి వుండవలసింది."

"నేర్పితే మాత్రం ఉపయోగమేమిటి బాబూ? ఈళ్లందరికీ రిక్షాలు ఎక్కడ నుంచి వత్తాయి? వత్తే మాత్రం అప్పుడాళ్లందరికీ పనులుండొద్దూ?"

"నిజంగా నువ్వు తెలివైనదానవు గైరమ్మా! మంచి ప్రశ్న వేశావు. నేను ఈ విషయం ముందు చెప్పాను. ప్రభుత్వం కొత్తకొత్త పరిశ్రమలు స్థాపించి, ఇలాంటి వాళ్లందరకూ వాటిల్లో పనులు కల్పించి ఆదుకోవాలని. చూడు, నేను నీకు కొద్దిరోజుల్లోనే చదువు నేర్పించి, నీలో ఎన్నో మార్పులు ప్రవేశపెట్టకపోతే..."

"ఎందుకు బాబూ అవన్నీ? ఈ బతుకిలా వెళ్లిపోతే చాలు!"

"అదిగో మళ్లీ వెనక్కి వెళ్లిపోతున్నావు. ఇలా అనేదానవు అంట్లు తోముకొనే బతకగూడదూ? కానీ నీకావని అంటే ఇష్టమే లేదు. నీ శక్తిని నీవు గుర్తించావు, ఎక్కువ కష్టపడటం వల్ల ఎక్కువ సుఖమున్నదని గ్రహించావు. సోమరితనమంటే నీకు గిట్టదు. ఓ గంట గంటన్నరలో అయిపోయే ఇంటిపని కోసం మిగిలిన గంటలన్నిటినీ మురుగుకాల్వలో పోయడం నీకు సుతరామూ ఇష్టం లేదు. ఇలాంటి నీకు ఉజ్జ్వలభవిష్యత్తు వుంది. దేశంలో ఎక్కడైతే సగం శక్తి నిర్జీవమైపోతోందో, అక్కడ నుంచి నువ్వు ఆశాజ్యోతిగా వెలుగుతున్నావు. నీవు ధైర్యానికీ, భవిష్యత్తుకూ చిహ్నానివి! నీలాంటి వీరవనితల వల్లనే ఎప్పటికైనా ఈ దేశానికి ముక్తి! ఈ సంఘంలో పేరుకొనిపోయిన అనుమానాల పెంటకుప్పల్నీ, జుగుప్సాకరమైన కుళ్లుకాల్వల వంటి ఊహల్నీ, నువ్వు పెల్లగించి పారేసి ఈ మనుషుల మేధలో ఉత్తమప్రమాణాలను తీర్చిదిద్దుతావు. ఒక ఆడది మగవాడితో మాట్లాడితేనే చాలు, సహించలేని ఈ దేశపు నెత్తురులో సరియైన దృష్టిని వినూత్నంగా

సృష్టిస్తావు. నిజమమ్మా నిజం! నీవు మహోన్నతంగా జ్వలించే విప్లవకాంతివి! నీవు నా ఊహకు ఏ విధంగానూ అందని చైతన్యస్వరూపిణివి! నువ్వు యుగయుగాల మునుముందు అనంతంగా పయనించే ఎవ్వటికీ అంతం కాని మార్గానికి మార్గదర్శినివి!"

"ఏంటండీ ప్లీడరుగారూ? ఏటి బాబూ ఆ మాటలు? మీరు దేవుడులా ఆనుతున్నారు. మీ కళ్లల్లో ఆ కాంతి ఏటి బాబూ?" అంటూ గైరమ్మ అతనివైపే చూస్తూ విస్తుపోయింది.

ఆమె ప్రక్కన నిలచిన పెద్దకుర్రాడు దీక్షగా అతనివైపే చూశాడు. చిన్నకుర్రాడు తల్లి చెంగు పుచ్చుకొని, భయంభయంగా శేషగిరివైపు తొంగితొంగి చూస్తున్నాడు.

శేషగిరి ఒక్కసారి మనుషుల్లోకి వచ్చి "ఏమిటన్నాను? నేను ఏమిటన్నాను?" అని స్వగతంగా అనుకొన్నాడు. "ఏమిటో పిచ్చిగా వాగేశాను. వస్తాను గైరమ్మా! రేపు మరచిపోకు!" అన్నాడు.

గైరమ్మ అతను పోయిన దిక్కువైపు అలాగే చూస్తూ వుండిపోయింది.

## 4

రాత్రి పిల్లలిద్దరూ నిద్రపోయారు. బయట వెన్నెల భవిష్యత్తులా వుంది. గుమ్మం ముందు కూర్చుని గైరమ్మ ఏమిటో ఆలోచిస్తోంది. ఏవేవో తెగని సమస్యలు ఆమె నరనరాన్నీ నరకుతున్నాయి. మధ్యమధ్య ప్లీడరు గుర్తుకొచ్చి తెగిన ఆమె ఆశలకు జీవం పోస్తూ పక్కకు తప్పుకుంటున్నాయి.

అప్పుడే గుసగుసలుగా కొన్ని కంఠాలు దగ్గర పడుతూన్నట్లు అలికిడైంది. ఘాటైన చుట్టకంపు ఆమెను ఇబ్బంది పెట్టి పక్కకు తప్పుకుంటోంది. పైమీద తువాలు ఎవరో టప్‌మని దులిపి, ఖాండ్రించి ఉమ్మారు. ఇద్దరు ముగ్గురు సకిలించారు. అప్పుడే చిన్న కలకలం నోరు తెరచుకొని ఆవులించి, బద్ధకంగా ఒళ్లు విరుస్తూ ఆమె ముందు మబ్బులా నిలిచింది.

"ఇంకా నిద్ర పోలేదా గైరమ్మా?" అన్నాడో రిక్షా అబ్బాయి.

"మన సంఘం నాయుడుగారొచ్చారు గైరమ్మా!" మరొకడు గైరమ్మ పక్కకే చేరాడు.

గైరమ్మ గుండె దడదడలాడింది. "ఏటి బాబూ, ఇలాగొచ్చినారు?" అంది.

"అదే గైరమ్మా!" అని సంఘం నాయుడు ఒకసారి కంఠం సరిచేసుకున్నాడు. ఒక విచిత్రమైన ధ్వని చేశాడు.

ఆ నేలమీదనే అంతా కూర్చున్నారు. గైరమ్మ నిలబడి ఉండిపోయింది.

"చూడు గైరమ్మా! నిన్ను చూత్తే నాకు చాలా జాలేత్తోంది. ఆడేమో అగస్మాత్తుగా నీకేదారీ చూపకుండా పోనాడు. పావం పిల్లలు, ఎలాగ బతుకుతావు?"

గైరమ్మ మాట్లాడలేదు.

"చూడు గైరమ్మా. ఒక్కమాట సెప్తా వింటావూ? మా ఊరిలో ఓ అమ్మాయుంది. ఆ పిల్లకు పుగాకు కంపెనీలో పని. రోజూ రెండున్నర పైనే తెచ్చుకుంటాది. పని కాడకెల్లకుండానే, కంపెనీ వోళ్లు గుర్తుకోసం ఇత్తావుంటారే, ఆ బిళ్ల అమ్మేత్తూవుంటాది. అక్కడి టైము కీపర్ని బుట్టలో ఏసుకుందిలే. అంచాత ఆడు సూసీసూడనట్టూరుకుంటాడు. మరి ఆ బిళ్ల కొనుక్కున్న అమ్మి రూపాయి తీసుకుని మిగిలింది ఆ పిల్లకిచ్చేత్తూ వుంటాది. పొలం కవులుకిత్తారే, అలాగే అనుకో. ముందు ముందు ఉజ్జోగాలు

> **ఈ కథను ఆంధ్రప్రభ సచిత్రవారపత్రిక 28.9.1960 సంచికలో ప్రచురించాము**

కూడా అలాగే కవులుకిచ్చేతారంటలే." ఈ మాట అని నాయుడు హుందాగా నవ్వి చుట్టూ వున్నవాళ్లు ఎంతమంది నవ్విందీ పరీక్షించుకొని "సూడు గైరమ్మా! పొగాకు పని శానాసులువు. నువ్వు ఊ అంటే ఆ పిల్ల నీకే ఆ బిళ్ల ఇచ్చే ఇదానం చెప్తా. కడుపులో సల్ల కదలకుండా పని చేసుకుపోవొచ్చు. ఏటంటావు?" అన్నాడు.

గైరమ్మ మెల్లగా "ఒక్క రూపాయి నాకేటి సరిపోతాది బాబూ? అయినా కట్టపడేవాళ్లకే పొలాలు కానీ కవులుకిచ్చేవాళ్లకు గింజలివ్వకూడదని-అదేటో ఆ మద్దె సెప్పినారు కాదా? ఆ తప్పే ఈ బుల్లి సేత్తే తప్పు కాదా బాబూ? ఆ ఆడది కట్టపడటమేటి... అదేమో కూసోని తిండమేటి? ఏటో నాకేటీ తెలీకండా వుంది."

"అబ్బో! మంచి సెబుతావుంటే సెడ్డ ఎదురవుతోందే? అయితే రిక్షా తొక్కడం మాననంటావ్?"

"ఏం బాబూ తప్పా?"

"తప్పా, తప్పున్నరా? ఇంకా సిగ్గునేకండా మాటాడుతున్నావు? ఆడదానివై పుట్టి మగోళ్లను రిక్షాలెక్కించుకుని తిరుగుతావా?"

"నాకెందుకు సిగ్గు, మీకుండాలి గాని? మగోళ్లువుండి ఆడోళ్లని రిక్షాలెక్కించుకుని తొక్కుతున్నారు! మీకుండాలా సిగ్గు, నాకా? పౌరుషమే లేదు మీకు!"


"ఆ? ఏమిటన్నావ్? నోటికొచ్చినట్టు వాగుతున్నావ్?"

"నా ఇంటి ముందుకొచ్చి మీరు వాగుతున్నారా, నేనా?"

"అబ్బో! ఇంత దూరం వచ్చిందా యవ్వారం? నాను సెవుతున్నాను. ఇనుకో గైరమ్మా. నువ్వు రిక్సా తొక్కావా, మర్నాడే మరి వత్తా వుండవు! ఎందుకొచ్చిన గొడవ నీకిదంతా? సుబ్బరంగా ఈ రిక్సా నేను సెప్పినోడికి బాడుగకియ్యి. పుగాకు పని సేసుకో. సక్కగా ఎల్లిపోద్ది సంసారం."

"ఒకడికి నాను బాడుగకియ్యడమేటి? ఆడి కట్టం నేను తినడమేటి? నాకిట్టం నేదు బాబూ. నా కట్టమేదో నేనే పడతాను."

"రాజాబుద్ది నీది గైరమ్మా! పెజలంతా ఇలాగే వుంటే కట్టాలే వుండకపోయేవి. ఒకటి సెప్తాను ఇను. నువ్వు ఇవాళ తొక్కుతావు. రేపు ఇంకొకర్తి తొక్కుతాది. ఎల్లుండి ఇంకో వందమంది బయలుదేరుతారు. అప్పుడేమవుద్ది? నువ్వు మంచి మడిసివే. ఆళ్లు నీలాగే మంచోళ్లవుతారా? అప్పుడు



మా బతుకేమవుద్ది? నువ్వే ఆలోచించి సెప్పు. మగోళ్లందరూ ఆడోళ్ల రిక్షాలంటేనే ఎగబాకుతారు. ఆల గుణమే అంతగదా... ఏటంటావు?"

ఈ మాటలతో గైరమ్మ లొంగిపోతుందనుకున్నారంతా. కాని-"ఎప్పుడో ఏటో జరుగుతాదని ఇప్పుడు నన్ను పావమంటారా? నాకిన్ని వనులు సూపించినోరు మీరే. వనులు సూసుకోనేరూ? వని సెయ్యాలిగాని వనులకేటి కరువు?"

"అబ్బో, శానా సదువులు సదివావే! సదువుకున్నోళ్లను సూడు. ఉజ్జోగాలు నేక ఎలా సచ్చిపోతన్నారో!"

"అయితే నాకు బతకడానికి ఈలుండి కూడా సచ్చిపోమంటారా? ఇదెక్కడి నాయం? అయినా మీరు సిన్నప్పటి నుంచి ఈ వని సేసీత్తన్నారా? పుత్తె కట్టినట్టు మాటాడుతారేం? పెట్రోలు రిక్సాలొత్తే అప్పుడేటి సేత్తారు?"

"పెట్రోలు రిక్సాలొచ్చినవ్పటి మాటకదా!"

"అలాగే ఆడోళ్లందరూ రిక్సాలు తొక్కినవ్పటి మాటగదా అనుకోగూడదా? ఎందుకిలా ఉత్తిపున్నేనికి బయపడిపోతారు? ఈ వనితప్ప ఇంకోవని సెయ్యలేం అనుకుంటే ఎప్పుడూ బయంగానే వుంటాది. ఏ వనైనా సెయ్యగలం అన్న గుండె నిబ్బరం వుంటే బయమే వుండదు!"

"నీ మాట నాకేమీ నచ్చలేదు గైరమ్మా! నువ్వు సంఘానికి సీడపురుగువి. నీ మూలాన ఆడోళ్లందరూ సెడిపోతారు. రేపొద్దుట మా పెళ్లాలు మా మాట ఇనరు. ఆళ్లూ రిక్షాలు తొక్కుతాం మీ లెక్కేటి అంటారు."

"ఆళ్లూ తొక్కితే నయమేగా... ఏడి నీళ్లకు సన్నీళ్లు తోడైనట్టుంటాది."

"ఎంత సెప్పినా నీ బుర్రకెక్కకుండా వుందే! సరే వదండిరా, ఎలా తొక్కుతాదో సూద్దాం. దీనికి డబ్బుపిచ్చి మాబాగా పట్టింది. కడమాటగా సెవుతున్నా, నా మాటిను గైరమ్మా!"

దీనితో రిక్షావాళ్లందరూ తలోమాటా నోటికొచ్చినట్టల్లా అనడం మొదలుపెట్టారు. "ఏం సూసుకొని దీనికి పొగరు?" అని ఒకడు, "నాలుగు తగలనియ్యండెహే!" అని ఒకడు, "కళ్లు మూసుకపోయి ఏడుత్తంది!" అని మరొకడు... ఏమేమో కూశారు.


గైరమ్మ తీక్ష్ణంగా వాళ్లవైపు చూసింది. వాళ్ల బాధేకాని తన సంగతి వాళ్లకేమీ పట్టదేం? అనుకుంది. ఇంతలో ఒకడు, "మొహమ్మీద ఉమ్మండిరా! రౌడీముండ! ఎలా నిలబడిందో!" అన్నాడు.

"ఏడిసింది వూరుకోండిరా! ఎవడ్నైనా సూడమంటావేటి? పెళ్లాడితే ఈ కట్టమంతా ఆడేవడతాడు. ఏటి?" అంటూ గుండెల్ని రక్కుతూన్నట్టు నవ్వాడు. అంతా గొల్లుమన్నారు. ఇంతలో ఇంకొకడు "కల్లు అమ్మకూడదూ? బోలెడు నాబం. నువ్వు కన్ను గీటితే కనకాబిసేకమే!" అన్నాడు.

ఎవరేమన్నా గైరమ్మ మాట్లాడలేదు. ఆమె కళ్లవెంట అలాగే కారుతున్న కన్నీరు భూమిలోకి ఇంకిపోయింది.

మూక మెల్లిగా ఇంటిదారి పట్టింది. కాని వారిలో ఆ భయం విజృంభించసాగింది. ఆ రాత్రికి రాత్రే సంఘం సెక్రెటరీ దగ్గరకు వెళ్లారు. అతను బద్ధకంగా లేస్తూ "ఏమిటి, ఇంత అర్ధరాత్రి పనిగట్టుక వస్తారు?" అన్నాడు.

నాయుడు అంతా చెప్పాడు. సెక్రెటరీకి నవ్వు వచ్చింది. "పిచ్చోళ్లలా వున్నారే! తిన్నగా ఇళ్లకు పోయి పడుకోండి" అన్నాడు.




కాని వాళ్లు కదల్లేదు. "ఇదిగోనయ్యోయ్! మేం పిచ్చోళ్లమో, మంచోళ్లమో అదంతా ఇప్పుడెందుకు? ఆ గైరమ్మకు లైసెన్సొచ్చిందా, ఇక మీ పార్టీలో వుండం! ఆ కాంగ్రేసోళ్లయితే ఆలదే ప్రభుత్వం కాబట్టి దానికి లైసెన్సు ఇవ్వకుండా సేసేస్తారు. రేపొద్దుటొచ్చి కలుస్తాం బాగా ఆలోచించుకో!" అన్నారు.

సెక్రెటరీకి మతి పోయింది. ఇంత అకస్మాత్తుగా ఆ స్వల్పకారణానికి వీళ్లిలా మారిపోడానికి కారణం అతని ఊహకందలేదు. ఇందులో ఏదో కుట్ర వుందనుకున్నాడు. వీళ్లంతా ఎదురుతిరిగితే తన పార్టీకి సగం బలం తగ్గినట్లే అని దిగులుపడిపోయాడు. అయినా కాంగ్రెసువాళ్లు మాత్రం ధర్మానికి కట్టుబడివుండకుండా ఎల్లా వుండగలరని మనసులో సరిపెట్టుకున్నాడు. 'న్యాయంగా బతకటానికి అందరికీ హక్కుంది. ఆమె చేసేదాంట్లే తప్పేముంది? వీళ్ల మూర్ఖపు పట్టుదల కాని!' అని అనుకుంటూ నిద్రపోబోయాడు. కాని నిద్ర రాదే! ఆలోచించే కొద్దీ ఇదేదో తేలనిసమస్యగా అతని మనసులో స్థిరపడటం మొదలుపెట్టింది. ఈ పరిస్థితిని, కాంగ్రెసువాళ్లు తనకనుకూలంగా ఉపయోగించుకుని పార్టీలో ముసలం పెడితేనో... ఇంకేముంది? ఎవరూ అడుగుపెట్టడానికి వీలులేని ఈ కంచుకోట ఆటంబాంబు పేలినట్లు పేలిపోతుంది. ఇప్పుడే జాగ్రత్తపడాలి. యాదవకులంలో ముసలంలా ఏదో జరుగుబోతోంది' అనుకున్నాడు.

ఆ మరునాడు ప్లీడరు శేషగిరి అతినేర్పుగా మాట్లాడి లైసెన్సు ఇనస్పెక్టర్ని తన గుప్పెట్లో పెట్టుకుని, గైరమ్మకు లైసెన్సు ఇప్పించాడు.

ఈ మాట ఆనోటా ఆనోటా ఊరంతా పాకింది. మరునాడు కొన్ని పత్రికలు ఈ వార్తను ప్రముఖంగా ప్రచురించాయి. ఇది చూసి ఓ కవికుమారుడు మూడుగేయాలు వ్రాశాడు. ఒక వృద్ధకవి, కలిమాయను గురించి పంచరత్నాలు పకడ్‌బందుగా అల్లాడు. ప్లీడరుగారి భార్య లీల ఒక వ్యాసం వ్రాసింది. ఏ రోజుకారోజు వూళ్లోని సమాచారం పత్రిక ఈ విశేషానికి సంబంధించిన విషయాలను పూర్తిగా ప్రచురించడం మొదలుపెట్టింది. ప్రజల్లో విపరీతసంచలనం కలిగింది. ఒక్కొక్కరూ ఒకొక్కలా చెప్పుకోవడం మొదలుపెట్టారు. కొంతమంది శరీరం ఆ మాట వినగానే పులకించింది. కొంతమంది మనసు "రామ రామ!" అని ముక్కుమీద వేలేసుకుంది.

కార్లు కూడా ఇకముందు ఈ ముష్టి ఆడవాళ్లు నడుపుతారేమో అనుకున్నారు. చాలామంది కార్లు గల ధనవపురాణీలు ఇహ

భర్తలను అదుపులో పెట్టడం మరీ కష్టం... ఇంట్లో దాసీపిల్లలతో సరసాలు సాగించినప్పుడే పట్టుకోడం కష్టమైపోతూంటే, బయట ఈ ఆడ(డ్రయివర్లతో వాళ్లు ఎక్కడెక్కడ ఎలా తిరుగుతారో ఎలా పసిగట్టగలం అంటూ బెంగపడిపోయారు.

"ఇలా ఆడవాళ్లు రిక్షాలు లాగడంవల్ల వాళ్ల గర్భకోశం దెబ్బతిని ఇక వాళ్లకు పిల్లలు ఛస్తే పుట్టరు! దీనితో దేశంలో కూలీలకోసం వాంటెడ్ కాలమ్స్, ప్రకటనలు పెచ్చుపెరిగిపోతాయి. దాసీపిల్లలూ, పిల్లల్ని ఆడించే అబ్బాయిలూ, అమ్మాయిలూ, గంపలు మోసేవాళ్లూ కంటికి కనిపించకుండా పోతారు. ఇక మనమే అన్నింటికీ చావాలి!" అని ఓ దూరదృష్టి బూర్జువా ఏడ్చాడు.


ఇహ గైరమ్మ పాపం, రెండు రోజులు రిక్షా మీద తిరిగింది. ఎవరూ రిక్షా ఎక్కలేదు. వెలి వేసినట్లు ఆమెను చూస్తున్నారు. మగవాళ్లకెందుకనో ఆ రిక్షా ఎక్కడానికి భయంగా వుంది. ఆడవాళ్లు గైరమ్మను అసహ్యించుకుంటున్నారు. కొందరు ఆమె ముందూ, వెనుకా నవ్వుతున్నారు.

రిక్షావాళ్ల గుండె గైరమ్మను చూసినప్పుడల్లా భగభగ మండిపోతోంది. కొంతమంది వయసు మళ్లిన రసికులు ఆ రిక్షాలో ఎక్కడానికి ప్రయత్నించారు. తిరిగి ఎందుకనో తటపటాయించి ఇంకో రెండురోజులు చూదాం అనుకున్నారు. గైరమ్మ గుండె నీటిబుగ్గ అయిపోతోంది. ఆమెకు ఏమి చేయడానికీ తోచలేదు. తనను చూచి అంతా ఎందుకలా భయపడిపోతున్నారు? అని ఏడ్చింది. తల పగలగొట్టుకోవాలనుకుంది. ఉత్తచేతులతో ఇంటికి వెళ్లడానికి ఆమె గుండె కుళ్లికుళ్లి ఏడ్చి నీరసించిపోయింది. కాని ఏమి చేస్తుంది?

ఆ మరునాడు డి.ఎస్.పి. దగ్గరనుంచి ఏమి ఆర్డర్లు వచ్చాయోగాని, గైరమ్మను పోలీసులు అరెస్టు చేశారు. న్యూసెన్సు కేసు పెట్టారు. శేషగిరి ఆమెను జామీను మీద విడుదల చేయించి, "నీకేం భయం లేదు" అన్నాడు.

గైరమ్మ ఆకాశం వైపు వెర్రిగా చూసింది. ఆమె మనసు ఏమిటో అనంతంగా పరిభ్రమిస్తోంది. ఆమె మాట్లాడకుండా ఇంటికి వెళ్లింది. పిల్లల్ని అలాగే చూసింది. తల్లి కళ్లల్లోకి పిల్లలు చూస్తూ ఎందుకో భయపడిపోయారు. గైరమ్మ కళ్లలో నీరు ఉబకలేదు. పిల్లలిద్దరూ బావురుమన్నారు.

గైరమ్మను అరెస్టు చేశారనీ, జామీను మీద విడుదల చేశారనీ, శేషగిరి కోర్టులో వాదిస్తాడనీ పత్రికలు ప్రముఖంగా ప్రచురించాయి. ఈ దెబ్బతో పత్రికల గిరాకీ పెరిగింది. మేజిస్ట్రేట్ కోర్టులో వాదప్రతివాదాలు కొల్లేటి చాంతాడులా పెరిగిపోయాయి. వేడివేడి పకోడీల్లాంటి ఆ




వాదాలు అందరికీ ఎంతో ఎంతో ఇష్టమయ్యాయి. క్రాస్ ఎగ్జామినేషన్‌లో గైరమ్మ సమాధానాలు బ్రిటానియా బిస్కెట్లలా ఉన్నాయని కొందరంటే, కొందరు రాకెట్లలోంచి పైకి జ్వలించే అగ్నిజ్వాలల్లా వున్నాయన్నారు. ఇహ ఆమె ఎట్లా ఆకర్షించిందీ, ట్రాఫిక్ ఏ విధంగా నిలిచిపోడానికి కారణమైందీ సాక్షులు ఏకరువు పెట్టిన విశేషాలు, ఓ పెద్ద ప్రణయసామ్రాజ్యానికి సంబంధించిన చారిత్రకగాథలా తయారై, ఓ విద్యార్థికి పిహెచ్.డి. డిగ్రీ సాధించి ఇవ్వడానికి వీలైనంత పటుత్వంతో పేపర్లలో నిలిచిపోయాయి.

ఈ హడావుడి అంతా చూసేసరికి రిక్షావాళ్ల గుండెలు మరింత పీచుపీచుమన్నాయి. ఈ గొడవ అంతటితో వదిలేది కాదని వాళ్లు హడలిపోయారు. కాంగ్రెసు పార్టీలో చేరిపోతే న్యాయం తమ తరఫున చెప్పించుకోవచ్చని ఆలోచించారు. ఆ పార్టీ నాయకులని కలుసుకున్నారు.

ఈ అదను దాటితే వీళ్లను ఆకట్టుకోవడం కష్టమని పట్టణకాంగ్రెస్ నాయకులు గట్టిగా భావించారు. "అలాగే చూదాం... ముందు మీరు మాలో చేరండి" అన్నారు. కాని ఒక ప్రాణి కోరుతూన్న ధర్మాన్నీ, న్యాయాన్నీ ఏ సాకుతో కాదనాలో తోచక తలలు పగులగొట్టుకున్నారు. పార్టీలను పగలగొట్టి పడగొట్టాలి. కాని, తలలు పగులగొట్టుకుంటే లాభమేముందనీ, ఈ సంగతి పైవారికి తెలియబరిచి వారి ఆదేశాలకోసం జపం చేస్తూ కూర్చున్నారు. ఈ సంగతి చల్లగా కాంగ్రెసు ప్రెసిడెంట్‌గారి దివ్యసముఖానికి తరలి వారి అనుజ్ఞకోసం చేతులు జోడించుకొని నిలబడిపోయింది.

కమ్యూనిస్టు పార్టీవారు ఈ విషయం తమ పెద్దలకు మనవి చేసుకున్నారు. న్యాయం అంటూ కూర్చుంటే పార్టీ చెక్కలైపోయేట్లుంది. ఇలాంటి సంకటపరిస్థితులలో పార్టీకోసం ఈ తప్పు చేసినా పరవాలేదు. ఆమె రిక్షా తొక్కడం న్యాయవిరుద్ధం అనమన్నారు.

ఈ గొడవ ఇలా రెండు పార్టీల మధ్య విచిత్రంగా తలదూర్చి అందరి తలలనూ ఖరాబు చేసిపారేసింది!

ఇదే అదను అనుకొని నాటకేశ్వరుడు, ఓ నాటకం అల్లిపారేశాడు. ఆ నాటకానికి బోలెడు డబ్బు వచ్చింది. రిక్షారాణి వేషం వేసిన చిట్టితల్లికి చింతాకు పతకమొకటి స్వేచ్ఛాసమితివారు అందరి సమక్షానా బహూకరించారు.

ఓ కవిమంత్రి ఈ గాథను కావ్యంగా తీర్చిదిద్ది సొమ్ము చేసుకోవడమే కాకుండా కావలసినన్ని సన్మానాలు చేయించుకున్నాడు.

పాపం, కొన్ని మహిళాసంఘాల్లో ఈ విషయం మీద వాదప్రతివాదాలు ప్రజ్వరిల్లి, సెక్రెటరీలూ, ప్రెసిడెంట్లూ మారిపోవడం తటస్థించింది.

కొంతమంది రాజకీయనాయకుల తారలు కూడా తలక్రిందులు కావడానికి వీలుంటుందేమోనని కొంతమంది ఆశాజీవులు ఎదురుచూడటం మొదలుపెట్టారు.

ఇహ పేపర్ల అమ్మకం సరేసరి! వాటి అమ్మకం అంచనాలకు లెక్కచేయకుండా దాటిపోవడం వల్ల పత్రికాధిపతులు చేతులు రెండూ పైకెత్తి ప్రజల్ని క్షమించమంటూ కోరుతున్నారు. వారి ఈ ఆదరణకు వారి తలలు ఎంతో ఎంతో కృతజ్ఞతాభావంతో వంగిపోతున్నాయని మరీమరీ విన్నవించుకున్నారు. ఇదే సమయంరా చిట్టితమ్ముడూ-అనుకొని కొంతమంది పేపర్లమ్మే హీరోపిల్లలు ఆ పేపర్లను బ్లాక్ మార్కెట్ చేశారని దేశమంతటా గగ్గోలైపోయింది.

శేషగిరి వాదాలతో ససేమీ ఏకీభవించని

మేజస్ట్రేటు, గైరమ్మకు ఓ నెల ఖైదు శిక్ష, యాభైరూపాయలు జరిమానా విధించారు.

శేషగిరి గైరమ్మను బెయిలుమీద విడిపించి ఆమెకు ధైర్యాన్ని నూరిపోసి, జిల్లా మేజస్ట్రేట్ కోర్టులో అప్పీలు వడేశాడు. ఆయన నేరం రుజువైందని చెప్తూ జరిమానా ఇచ్చుకోవలసిందనీ, జైలు శిక్ష తగ్గిస్తున్నాననీ చెప్పారు. అయితే శేషగిరి వదల్లేదు. అతను ముందుకు ప్రవహించే నదిలాంటివాడు కాబట్టి, శ్రమ అనుకోక హైకోర్టులో రివిజన్ పిటీషన్ వడేశాడు.

అంతా హైకోర్టు నుంచి వెలువడే వార్త కోసం, ఆ తీర్పుల ముక్తాఫలం కోసం ఎదురుచూస్తున్నారు. ఇది హక్కులకు సంబంధించిన విషయం, గైరమ్మకే న్యాయం జరగాలి అని ఒకరు. ఇది సంఘానికి సంబంధించిన విషయం, గైరమ్మ సంఘద్రోహి.. ఆమెకు న్యాయం జరగకూడదు, సంఘం పతనం చెందకూడదు అని మరొకరూ, ఎక్కడ చూసినా ఐక్యరాజ్యసమితిలోని పెద్దమనుషుల్లా దెబ్బలాడుకోవడమే కాని ఏకీభవించడం మాట మరచిపోయారు.

ఇది ఇలా వుండగా అకస్మాత్తుగా ఓ రోజున మబ్బు అడ్డకుండా సూర్యుడు తెల్లగా వెలిగిపోతూన్న ఓ శుభముహూర్తాన హైకోర్టు నుండి అత్యద్భుతమైన ఓ వార్త వెలువడింది.

న్యాయమూర్తి గైరమ్మకు క్రింది కోర్టువారు విధించిన శిక్ష రద్దు చేసివేశారు. భారత రాజ్యాంగం ప్రకారం పురుషునికీ, స్త్రీకి సమానహక్కు ఉన్నదన్నారు. ఆడవాళ్లయినంత మాతర్ం చేత లైసెన్సు లివ్వకపోవడం సమంజసం కాదనీ, లైసెన్సులు పొందిన ఆడవాళ్లు సూత్రాలకు కట్టుబడి వున్నప్పుడు, వాళ్లను రచ్చకీడ్వడం న్యాయం కాదనీ సెలవిచ్చారు. కడమాటగా ఆమె వృత్తిని ఆమె చేపట్టి సక్రమంగా కాలం వెళ్లబుచ్చుతూ వుంటే ఎవ్వరూ అడ్డగూడదనీ, ఇలా అడ్డేవారెవరైనా వుంటే వైద్యశాలల్లో ఆడనర్సులు మగవాళ్లకు పరిచర్యలు చేయడం సహించలేని బాపతేకాని మర్యాకరకం కాదనీ, పెదవి చివరల నుండి సన్నని నవ్వును వెలార్చారు. ఈ మాట విని అందరూ సంతోషించారు. "జడ్జిమెంటు చాలా బాగుందంటే చాలా బాగుంది!" అన్నారు.

"నర్సులూ వుండవలసిందే, రిక్షాలు తొక్కే యువతులూ వుండవలసిందే!" అన్నారు.

ఈ వార్త రేడియో ద్వారా దేశమంతా పాకిపోయింది. పదిహేను సంవత్సరాలైనా నిండకముందే భారతదేశంలోని స్త్రీలు అత్యద్భుతమైన స్వాతంత్ర్యాన్ని అనుభవిస్తున్నారని లండన్‌లోని కొన్ని పత్రికలు వేనోళ్ల కొనియాడాయి. ప్లీడరు శేషగిరి కీర్తి దశదిశలా వ్యాపించింది. ఆ సాయంకాలం అతన్ని వూరంతా ఊరేగించారు. లీల తన భర్తను చూసి ఉప్పొంగిపోయింది.

కాంగ్రెస్ హైకమేండు, కమ్యూనిస్టు పార్టీ సెక్రెటరీ, గైరమ్మదే న్యాయం అన్నారు. రిక్షావాళ్ల మూర్ఖపువట్టుదలకు తల ఒగ్గగూడదన్నారు. ఛోటా నాయకులంతరూ కాళ్లు తొక్కుకున్నారు.

ఆ రాత్రి గైరమ్మ దీర్ఘంగా ఆలోచిస్తూ ఇంటిలో కూర్చుంది.

"ఇంకా ఎందుకే అవ్మా, అలా వున్నావు? ఇంక రేపటి నుంచి పరవాలేదు కదే!" అన్నాడు పెద్దకుర్రాడు.

"నీకు తెలియదు నాయనా! రేపటి నుంచి మన రిక్షా మొగం ఎవ్వరూ సూడరు!"

"అదేవేం అవ్మా?"

"వాళ్లకు భయం బాబూ!"

"భయమెందుకే?"

"ఏమో తండ్రీ! ఆళ్లకి నన్ను సూత్తే వల్లమాలిన భయంగా వుంది."

"నువ్వన్నీ ఇలాగే సెప్తావు. ప్లీడరు గారు సెప్పారుగా రేపట్నించి హాయిగా మనం బతకొచ్చని!"

"ఆయనలాగే సెప్తాడురా. కాని మన రిక్సా ఎవరూ ఎక్కరు బాబూ! ఆళ్లకి నీతిగా బతకడం అంటే భయం. అలా బతికేవోళ్ల దగ్గరికి ఆళ్లు రాలేరు. ఏం సేత్తాం?" అంది.

తల్లి మాటలు కుర్రాడికి అర్థం కాలేదు. అలాగే తల్లి ఒడిలో నిద్రపోయాడు.

ఆ రాత్రి అస్తమించిపోతూన్న చంద్రుడు గిలగిలా కొట్టుకున్నాడు. వెనువెంటనే చిట్టచీకటి, కత్తి పుచ్చుకొని నిలబడింది.

గైరమ్మ బిడ్డలను దగ్గరగా లాక్కుంది. వారి ఒళ్లు వెచ్చగా కాలుతున్నట్లనిపించింది. జ్వరం తగిలిందేమోనని నిద్రలోనే అనుకుంది. తిరిగి చేయి వేసింది. పిల్లవాడు కెవ్వుమన్నాడు. నిద్రమత్తును విసిరికొట్టి, కొట్టుకుంటూన్న గుండెలా చలించిపోతూ లేచింది. నెత్తిపై సూర్యుడు మండిపోతూన్నట్లుంది. కాళ్ల క్రింద భయంకరమైన నీడలు పిచ్చిపిచ్చిగా రూపం మార్చుకుంటున్నాయి. ఆమె విహ్వలంగా అరిచింది. నిప్పులలో ఉడికిపోతున్న వంకాయలా ఆమె శరీరం ఉడికిపోవడం మొదలుపెట్టింది. ఏడుస్తూ తనను చుట్టుకొనిపోయిన బిడ్డలనిద్దరినీ ఎత్తుకుంది. ఆ తల్లి బాధ ఆ రాత్రి ఎలా చెప్పగలం? ఒక్క విసురుతో ఆమె తలుపు వద్దకు వెళ్లింది. తలుపులకు బయట గొళ్లెం పెట్టివుంది. ఆమె పైప్రాణం పైనే పోయింది. ఆ తలుపును గోళ్లతో పట్టి పీకింది. గట్టిగా తన్నింది.

"మమ్మల్ని బతికించండి బాబూ! మమ్మల్ని బతికించండి!" అని అరచింది.

తన పొట్ట కింద బిడ్డలను పొదువుకొని తన తలతో "కృష్ణా! కృష్ణా!" అని ఆ తలుపును భయంకరంగా బాదింది. అప్పటికే ఆమె చేతులలోనే ఆ బిడ్డల ప్రాణవాయువులు గాలిలో కలసిపోయాయి. ఆమె చీరకు నిప్పంటుకుంది.

ఒక్కసారి మంటలు తిరిగి చూరును తాకాయి. నక్షత్రాలు ఆకాశంలో ఎర్రగా మండిపోయాయి. ఆ తల్లిని, ఆ విప్లవమూర్తిని ఆ మంటల్లోంచి చేతులు చాచి అందుకున్నాయి.

**(అయిపోయింది)**

■

